కథ

డా॥ సమ్మనూరు రమేష్ బాబు

జంతు ప్రపంచంలో శిశువు



అది జువాలజీ లేబోరేటరీ. లెక్చరర్ అపర్ణ బి.ఎస్పీ విద్యార్థులకు సయామిస్ కవలల గురించి చెబుతోంది. 'అతుక్కుపోయి పుట్టే కవలల్ని సియామిస్ కవలలు అంటారు. ఇలా చాలా అరుదుగా జరుగుతుంది. ఇలా పుట్టినవారు ఎక్కువరోజులు బ్రతకలేరు. కానీ సైన్స్ బాగా అభివృద్ధిచెందిన ఈ రోజుల్లో ఆపరేషన్ ద్వారా ఈ బిడ్డల్ని వేరుచేసి మామూలు బిడ్డలమాదిరే ఎక్కువకాలం బ్రతికే అవకాశాన్ని కలగజేస్తున్నారు మన సైంటిస్టులు. ఇదిగో ఈ స్పెసిమన్‌ను చూడండి'' అంటూ చెప్పుకుపోతోంది అపర్ణ.

ఒక మోస్తరు గాజుతొట్టిలో ఫార్మాలిన్ ద్రావణంలో మునిగివుంది ఆ స్పెసిమన్. రెండు తలలు, ఒళ్లు అతుక్కుపోయి పుట్టిన సయామిస్ కవలల స్పెసిమన్ అది. పిల్లలు ఆసక్తిగా చూస్తున్నరు.

అపర్ణ క్లాసులంటే వారికెంతో ఇష్టం.

చక్కగా తలకెక్కేలా, మళ్లీ చదవనక్కరలేకుండా బాగా టీచ్ చేసే మేడమ్స్‌లో అపర్ణదే మొదటిస్థానమని పిల్లలంతా అనుకుంటూ వుంటారు.

అపర్ణకు 35 ఏళ్లుంటాయేమో. ఇంకా పెళ్లికాలేదు. అసలు పెళ్లిచేసుకునే ఉద్దేశమే వున్నట్లు కనిపించదు. ఆమెకు అంతరంగికులుకూడా పెద్దగా వున్నట్లు లేదు. ఎప్పుడూ ఒంటరిగా, దిగులుగా వుంటుంది. ఆమెగురించి ఆలోచిస్తోంది కాత్యాయని. ఆమె బి.ఎస్సీ ఫైనలియర్ స్టూడెంట్.

"ఎలాగైనా సరే మేడమ్‌తో మాట్లాడాలి. పర్సనల్ విషయాలు తెలుసుకోవాలి. మనగురించి ఎంతో ఆరాటపడే ఆ మేడమ్ మనసులో ఏముందో. లేకపోతే ఎందుకంత దిగులుగా వుంటుంది? ఆమెకు ధైర్యం చెప్పాలి. నన్ను పెద్ద ఆరిందా అనుకున్నా ఫర్వాలేదు. ఐవాంట్ టు గివ్‌హర్ సమ్ సార్ట్‌ఆఫ్ రిలీఫ్'' అని అనుకుంటూ హాస్టల్‌కు వెళ్లింది కాత్యాయని. అరగంటలో ముస్తాబై, వార్డెన్ గదిలోకి వెళ్లింది కాత్యాయని 'మేడమ్' అంటూ.

"ఎస్. కమిన్'' అంటూ పడక కుర్చీలో కూర్చునే పిల్చింది అపర్ణ.

లేత పసుపుపచ్చని చీర కట్టుకుని వుంది. నొసట పెద్ద కుంకుమబొట్టు. నిజానికి ఆ బొట్టే ఆమెకు కొత్త అందాన్నిస్తుంది. చీరకట్టుకూడా అతిసామాన్యంగా వుంటుంది. కానీ అందులోనే ఎంతో ఆకర్షణ వుంటుంది. మగవారికి ఎలా అన్పిస్తుందో మరి...

కాత్యాయని గొంతు పెగిల్చింద.

"మేడమ్! మీరు మరోలా అనుకోకపోతే... నేను మిమ్మల్ని కొన్ని విషయాలు అడగదల్చుకున్నాను''

"అనుకోవడమేమిటి కాత్యాయనీ! నేనున్నదే మీ డౌట్లు తీర్చడానికి. అడుగు. సందేహమెందుకు'' అంది అపర్ణ కాత్యాయనిని కూర్చోమని సైగచేస్తూ.

"మేడమ్! నేను అడగదల్చుకున్నది పర్సనల్ మేటర్'' అంది కాత్యాయని సందేహిస్తూ.

"పర్సనల్ అంటే నీకు పర్సనలా? నాకు పర్సనలా? నీ విషయం నాకు చెప్పేటట్టయితే ఓకే! నా విషయం గురించి తెలుసుకోవాలంటేమాత్రం సారీ. నాకు పర్సనల్ అంటూ ఏమీ లేదు'' అని చెప్పింది అపర్ణ.

కాత్యాయని మరి మాట్లాడలేకపోయింది.

"మీ విషయమే మేడమ్...'' అని ఏదో చెప్పబోయింది.

"సారీ! నా విషయం నేను ఏమీ చెప్పలేను. నిజానికి చెప్పడానికి ఏమీ లేదు. నేనొక అనాధను. అమ్మా నాన్నా ఎవరో తెలియదు. మద్రాసు గాంధీ అనాథ శరణాలయంలో పెరిగాను. చదువుకునేరోజుల్లో ఒక వ్యక్తిని ప్రేమించి అభాసుపాలయ్యాను. ఆ తరువాత ప్రేమాలేదు. పెళ్లీలేదు. ఇదిగో! ఇదీ జీవితం'' అని అంటూ "ఇక చాలా'' అంటూ నవ్వింది అపర్ణ.

కాత్యాయని నిశ్శబ్దంగా వుంది.

"చూడు కాత్యాయనీ! నామీద అభిమానంతో ఏదో అడగాలని వచ్చావు. చాలా సంతోషం. కానీ అందువల్ల ప్రయోజనం లేదు. పోయి శ్రద్ధగా చదువుకోమ్మా!'' అంది అపర్ణ.

"సారీ మేడమ్'' అని వెళ్లబోయింది కాత్యాయని.

"ఇంతకూ నీదే వూరన్నావ్. మీ అమ్మానాన్నా పేరేమిటి?'' అడిగింది అపర్ణ.

"మేడమ్, నాకు నాన్న లేరు. చిన్నప్పుడే పోయారు. అమ్మ పార్వతమ్మ. ఏభై ఏళ్లుంటాయి. అన్నయ్య రామ్‌గోపాల్. మేము అక్కడే వుంటాము. వదినె అహల్య'' అంది కాత్యాయని.

"అన్నయ్య రామ్‌గోపాలా? ఏం చేస్తారు?'' అంది అపర్ణ అదోమాదిరిగా.

"ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మద్రాసులోనే చదువుకున్నాడు. ఇప్పుడు విజయవాడలో పనిచేస్తున్నాడు'' అంది కాత్యాయని ఆసక్తిగా.

అపర్ణకు ఒక్కసారిగా గుండె కెలికినట్లయింది. రామ్‌గోపాల్ పేరు వినడంతోటే షాక్‌తిన్నట్లయింది. తన జీవితంతో ఆడుకున్న రామ్‌గోపాల్ చెల్లెలా కాత్యాయని అనుకుంది. అతికష్టమ్మీద భావోద్రేకాన్ని అణిచిపెట్టుకుని కాత్యాయనిని పంపించివేసింది. తలుపులు వేసుకుని గతం తలుపులు తెరిచింది.

అప్పుడే విచ్చుకున్న మందారంలా పరుగులు వేస్తున్న పరువంలో వుంది తను.

ఝుంకారాలు చేస్తూ మధువును గ్రోలడానికి సిద్ధంగా వున్న మధుపంలా వున్నాడతను.

బాగా చదువుకున్నవాడు.

అంతో ఇంతో అందంగా వున్నవాడు.

మంచి ఉద్యోగం వస్తుంది.

పైగా మంచివాడు.

అనాధనని తెలిసినా 'పెళ్లిచేసుకుంటాను. సందేహమెందుకు?' అన్నాడు.

జీవితమంతా రంగుల కలలా భ్రమింపజేసాడు.

సినిమాలంటూ షికార్లంటూ తిప్పాడు.

జీవితమంతా పాలుపంచుకుంటానన్నాడు.

ఒకరోజు...

అతని గదికెళితే ఎంతో ప్రేమగా పిలిచి ఆదరంతో పాలు ఇచ్చాడు. ఎంతో పరవశంతో తాగాను. అంతే క్షణాల్లో మైకం కమ్ముకుంది. గాఢమైన మత్తులో మునిగిపోయాను. కైపు దిగేసరికి నా జీవితాన్ని బుగ్గిపాలు చేశాడు ఆ రాక్షసుడు

మత్తుమందు ఇచ్చి నన్ను మైకంలో స్పృహలేకుండా పడిపోయేలా చేశాడు. తర్వాత నా ఒంటిమీద నూలుపోగులేకుండాచేసి తనివి తీరేలా తన పశువాంఛను తీర్చుకున్నాడు.

మూడు గంటలతరువాత మెలకువ వచ్చిన నాకు నా పరిస్థితి ఏమిటో అర్థమైంది. పూర్తి నగ్నంగా వున్నాను నేను. రాక్షసదాహం తీర్చుకున్న రామ్‌గోపాల్ ఇంకా నా అణువణువును గుచ్చిగుచ్చి చూస్తున్నాడు.

"ఏమిటిది? ఏం జరిగింది?'' అంటూ నేను భోరుమని ఏడ్చాను. సిగ్గుతో చితికిపోయాను.

"ఏం కాలేదు. పెళ్లికిముందే శోభనం. దట్సాల్'' అని సిగరెట్‌పొగ దట్టంగా వదిలి "నో నో మళ్లీ పెళ్లీ గిళ్లీ ఏమిటి? న్యూసెన్స్. ఇదొక థ్రిల్. జస్ట్ ఒన్ టైప్ ఆఫ్ ఫన్'' అంటూ వికటంగా నవ్వాడు.

హేండ్‌కర్చీఫ్‌ను వాడుకున్నట్లు వాడుకుని చెత్తకుండీలోకి విసిరివేసే మగవాడి నవ్వు నవ్వాడు. అతి వికృతంగా, విపరీతంగా వుందది.

భరించలేకపోయాను. అయినా ఆడదాన్ని. కాళ్లమీద పడ్డాను. చలించలేదు. "ఐ కెన్ హేవ్ యు యాజ్ మై కీప్'' అన్నాడా రాస్కెల్. బెదిరించాను.

"చూడు డార్లింగ్! పిచ్చి పిచ్చి వేషాలు వేయకు. నీ నగ్నశరీరాన్ని రకరకాల కోణాలలో నా కెమెరాతో ఈస్ట్‌మన్‌కలర్ ఫిల్మ్ పైకి ఎక్కించాను. బజారుకెక్కిస్తాను జాగ్రత్త. ఇక నా జోలికి రాకు. నన్ను మరచిపో'' అంటూ అతి చిత్రంగా నవ్వాడా కీచకుడు.

చదువుకుని మోసపోయాను నేను.

ఆ సంఘటనను మరచిపోవడానికి ప్రయత్నించాను.

నా దురదృష్టం....

నాకు నెలతప్పింది. జరిగిన దారుణాన్ని నాకు తల్లిలాంటి దుర్గమ్మతో చెప్పాను. ఆమె నన్ను అనునయించింది. జరిగిపోయినదానిగురించి బాధపడవద్దంది. నిబ్బరంగా వుండమంది. పది నెలలు గడిచాయి. మళ్లీ దురదృష్టం వెంటాడింది. 'ఇదీ మంచికేలే' అంది దుర్గమ్మ. వేరే వ్యక్తిని పెళ్లిచేసుకుని హాయిగా వుండమంది. నాకు మాత్రం మగజాతిమీదే అసహ్యం పుట్టింది. ఈలోగా లెక్చరర్ ఉద్యోగం వచ్చింది. చదువుతోటే లోకంగా బతుకుతున్నాను.

మళ్లీ ఈనాటికి కాత్యాయని మూలంగా ఆ రాక్షసుడిగురించి తెలిసింది. మనసంతా వికలమైపోయింది. కాస్సేపైనా ప్రశాంతంగా వుండడంకోసం సాయి మందిరానికి వెళ్లాను. ఒక మూలగా కూర్చుని కళ్లు మూసుకున్నాను. కళ్లు తెరిచేసరికి ఎదురుగా దుర్గమ్మ. చాలా పెద్దదైపోయింది.

"అమ్మా! అపర్ణా బాగున్నావా! మీ ఆయన ఏడీ'' అంది.

నేను దుర్గమ్మను బయటకు తీసుకువచ్చి నా సోదంతా చెప్పాను.

"ప్చ్! అయితే నీవు పెళ్లిచేసుకోలేదన్నమాట'' అంది భారంగా.

నేనేమీ మాట్లాడలేదు. దుర్గమ్మే అంది "అపర్ణా నీకొక రహస్యం చెప్పాలమ్మా. చెప్పకపోతే నాకు పాపం వస్తుంది. ఆరోజు నీకు పుట్టిన బిడ్డ చనిపోయి పుట్టినమాట వాస్తవమే. కాని అది మామూలు బిడ్డ కాదు. రెండు తలలు, ఒళ్లు అతుక్కుపోయి పుట్టిన బిడ్డ. పూడ్చిపెడదామనే నేనను కున్నాను. కాని డాక్టర్ అడగడంతో ఆ బిడ్డను ఇచ్చేశాను. డాక్టర్ దాన్ని స్పెసిమెన్‌గా భద్రపరిచి ఇదే ఊళ్లో ఏదో క్రిస్టియన్ కాలేజీకి ఇచ్చారట.

నేను ఏమీ మాట్లాడలేకపోయాను. నిశ్చేష్టనయ్యాను.

"అంటే... రోజూ నేను లేబరేటరీలో చూచే సయామిస్ స్పెసిమన్ నా పేగులు తెంచుకుని పుట్టిన బిడ్డా?''

వివరీతమైన దుఃఖం వచ్చింది. రాత్రంతా నిద్ర రాలేదు. పొద్దున్నే లేచి త్వరగా వెళ్లిపోయాను కాలేజీకి. లేబోరేటరీ తలుపులు తెరిచి సయామిస్ కవలల్ని చూస్తూ నిలబడ్డాను.

కళ్లవెంట నీళ్లు ధారాపాతంగా కారిపోతున్నాయి.

నిన్నటిదాకా అది స్పెసిమన్. నాకూ దానికీ సంబంధమే లేదు. ఈ క్షణంనుంచి నాకూ దానికీ సంబంధముంది. పాపకార్యానికి ప్రతిరూపంగానే ఆ స్పెసిమన్ కన్పిస్తున్నా అంతటి ఆ పాపకార్యాన్ని విస్మరించి ఎగదన్నుకొచ్చే మాతృహృదయం మాత్రం ఉద్వేగంతో ఊగిసలాడుతోంది.

"అపర్ణా'' అంటూ లోపలికొచ్చింది రమణి. ఆమె సహ ఉద్యోగిని.

"వ్వాట్ హేపెండ్'' అంది రమణి కాస్త కంగారుగా.

"నథింగ్'' అంటూ కళ్లు తుడుచుకుంటూ బయటకు వెళ్లిపోయింది అపర్ణా మేడమ్.

"కామంతో కళ్లు కప్పుకుపోయిన మగవాడికి ఆడది విలాసవస్తువుగానే కన్పించింది. వినోదం తీరాక ఆ వస్తువును సిగరెట్ పీకమాదిరిగా నలిపి పారేశాడు. గాజుతొట్టి, ఫార్మాలిన్ ద్రావణం, సయామిస్ కవలలున్న స్పెసిమన్‌కూడా హృదయమున్న ఆడదానిముందు కేరింతలు కొడుతుంది. జీవితం ఎంత చిత్రమైంది. అందునా ఆడదాని మాతృహృదయం మరింత చిత్రమైంది.''

ఆరోజు రాత్రి అపర్ణ డైరీలో వ్రాసుకున్న అంశం ఇది.

▶ ◆ ◀